# దొంగ మాటలను నమ్మద్దు



సదాశివపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

- కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ లేదు
- కవ్వంపల్లి మాటలకు వారెంటే లేదు
- ఊర్లకు వచ్చే పగటిబిచ్చగాళ్లను తరిమికొట్టాలి
- అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయండి
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్
- పలు గ్రామాల్లో ముమ్మర ప్రచారం

మానకొండూర్ రూరల్, నవంబర్ 8: 'కాంగ్రెస్ ఇచ్చే ఆరు హామీలకు గ్యారెంటీ లేదు. మానకొండూర్ ఆ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి మాటలకు వారెంటీలేదు' అంటూ మానకొండూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దొంగమాటలతో ఊర్లకు వచ్చే వాళ్లను నమ్మద్దని, ఆ పార్టీ పగటి బిచ్చగాళ్లను పొలిమేరల దాకా తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి, మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, రంగపేట గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ముమ్మరంగా ప్రచారం చేశారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మళ్లీ గెలిపిస్తే చేయబోయే పనులను వివరిస్తూ ఓటేయాలని కోరారు. అనంతరం రసమయి మాట్లాడారు. దాదాపు యాభై ఏండ్లు అధికారం అనుభవించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఒక్కచాన్స్ ఇవ్వాలంటూ అడగడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. తెలంగాణను సాధించి అనంతరం అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా రైతుబంధు, రైతుబీమా లాంటి బృహత్తర పథకాలను అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం ₹400కే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి ₹5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులకు ₹6016, వృద్ధులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ₹5016 పింఛన్ ఇస్తామని చెప్పారు. ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులైన దళితులందరికీ దళితబంధు కింద ₹10 లక్షలు అందజేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే కర్ణాటక గతే ఎదురవుతుందన్నారు. ఇప్పుడు ఇస్తున్న 24 గంటల కరెంట్ 3 గంటలు అవుతుందన్నారు. ప్రజలు ఆలోచించి పనిచేసేవారికే ఓటేయాలని కోరారు. జీవీఆర్ మాట్లాడుతూ, గుండాయిజానికి, పంచాయితీలకు దూరంగా ఉంటూ ప్రజల కోసం తపించే రసమయిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాగా శ్రీనివాస్‌నగర్‌లో మాజీ సర్పంచ్ ఎరుకల భాగ్య-శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యేకు నామినేషన్ వేసేందుకు ఖర్చులకు ₹5 వేల నగదును అందజేశారు. జగ్గయ్యపల్లిలో పార్టీలో చేరిన దాదాపు 40 మందికి ఎమ్మెల్యే, జీవీఆర్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగ్గయ్యపల్లిలో కూకట్‌పల్లికి చెందిన పరిశీలకుల బృందం సీహెచ్ దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు తమ మద్దతు ప్రకటించారు. ప్రతి గ్రామానికి చేరుకున్న రసమయి బాలకిషన్‌కు, జీవీఆర్‌లతో పాటు ప్రముఖులకు ఆడబిడ్డలు, కోలాట మహిళలు,డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా బతుకమ్మలతో, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల ప్రకాశ్, గడ్డం నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్‌లో కోలాటం ఆడుతూ రసమయికి స్వాగతం పలుకుతున్న మహిళలు, చిన్నారులు

# నిబంధనల మేరకు కౌంటింగ్ ఏర్పాట్లు ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, నవంబర్ 8: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్‌కు కౌంటింగ్‌కు మధ్య సమయం తక్కువగా ఉన్నందున ఇప్పటి నుంచే కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను మిషన్‌మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఎన్నికల విభాగపు సిబ్బంది, తదితర అధికారులతో గురుకులంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లు, పాటించాల్సిన నియమ నిబంధనల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అన్ని విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. ఈసీఐ సూచనల మేరకు కౌంటింగ్ హాలులో ఎలాంటి ఏర్పాట్లు చేయాలో చెప్పారు. కౌంటింగ్ కేంద్రం లేఅవుట్ సిద్ధం చేయడం, కమ్యూనికేషన్ ప్లాన్, కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించడానికి గల నిబంధనలు, కౌంటింగ్ ఏజెంట్ల నియామక నిబంధనలను, అబ్జర్వర్లకు సంబంధించి చేసుకోవాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి, ఆర్వోల బాధ్యతలు, మీడియా సెంటర్ ఏర్పాట్లు, ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు, భద్రత చర్యలు, వీడియోగ్రఫీ, ఫైర్ సేఫ్టీ చర్యలు తదితర విషయాలపై కలెక్టర్ అధికారులకు వివరించారు. ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌంటింగ్ రూమ్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఎలా ఉండాలి, సీసీ కెమెరాలు ఏర్పాటు, వీడియోగ్రఫీ చేయడం, రాండమైజేషన్ ఎప్పుడెప్పుడు చేయాలన్న వాటిపై రిటర్నింగ్ అధికారులకు వివరించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీపీఆర్వో ఎం.దశరథం, సిరిసిల్ల, వేములవాడ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

కలెక్టరేట్, నవంబర్ 8: నవంబరు 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎన్నికల విధులు బాధ్యతలపై జిల్లాలోని 123 మంది సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు. సూక్ష్మ పరిశీలకులు సాధారణ పరిశీలకులు కంట్రోల్‌లో పని చేస్తారన్నారు. గుర్తించిన పోలింగ్ కేంద్రాలలో వీరు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ రోజు ఎన్నికల సంఘం నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తున్నారా అనే అంశాలను సూక్ష్మ పరిశీలకులు పరిశీలించాలన్నారు. పోలింగ్ రోజున పరిశీలించిన అంశాలను వారికి ఇచ్చిన ఫార్మాట్‌లో నింపి అబ్జర్వర్‌కు అందజేయాలన్నారు. సూ క్ష్మ పరిశీలకుల నివేదికల ఆధారంగానే కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. శిక్షణలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి పి.బి.శ్రీనివాసచారి, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## బడుగులకు మేలు చేసింది బీఆర్ఎస్సే

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య




ఎల్లారెడ్డిపేటలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న బస్వరాజు సారయ్య

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 8: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడింది బీఆర్ఎస్ సర్కారే అని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రజకులకు, నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించి అక్కున చేర్చుకున్న విషయాన్ని గుర్తించాలని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు మేలు కోసం ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోమారు అధికారంలోకి తీసుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాలపై ఉన్నదన్నారు. ఇక్కడ రజక సంఘం రాష్ట్ర నాయకుడు అక్కరాజు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, మండలాధ్యక్షుడు కంచర్ల నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటేయండి

- రసమయికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం
- ప్రభుత్వ పథకాలపై ఇంటింటా అవగాహన



వల్లంపట్లలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లంతకుంట, నవంబర్ 8: తెలంగాణలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఆ పార్టీ నాయకులు ప్రజలను అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కందికట్కూర్, వంతడుపుల గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జాడ కనబడలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సాగు నీరు, 24 గంటల విద్యుత్తు, రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. చిన్న జిల్లాల ఏర్పాటుతో పరిపాలన సౌలభ్యంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ చీకటి మయమవుతుందని ప్రజలు గుర్తించాలన్నారు. మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న రసమయి బాలకిషన్‌ను మూడో సారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో సర్పంచులు కట్ట వెంకట్‌రెడ్డి, ముత్యం అమర్‌గౌడ్, నాయకులు నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్నికల పారదర్శక నిర్వహణకే కవాతు



వల్లపంట్లలో కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐ సుధాకర్, బీఎస్ఎఫ్ బలగాలు

ఇల్లంతకుంట, నవంబర్ 8: తెలంగాణలో జరుగుతున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికే కవాతు నిర్వహిస్తున్నామని ఎస్ఐ దాస సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని అనంతారం, రహీంఖాన్‌పేట, వల్లంపట్ల, ఓగులాపూర్ గ్రామాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవడానికి ప్రజలు, నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరికీ భయపడకుండా ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కవాతులో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.